స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలికి అభినందన



సికింద్రాబాద్: ఇటీవల జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలిగా ఎన్నికైన బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజను సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అభినందించారు. కౌన్సిల్ సభ్యురాలిగా ఎన్నికైన శైలజ సోమవారం ఎమ్మెల్యేను సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన నాయకులు సమస్యల పరిష్కారం, సమగ్ర అభివృద్ధి కోసం నిబద్ధతతో పని చేయాలన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావికి చెందిన హరిమిందర్‌కౌర్‌కు చికిత్స నిమిత్తం మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ పత్రాలను అందజేశారు. కంది నారాయణ, బాలాజీ, సంగీత్, శేఖర్, ప్రశాంత్‌గౌడ్ మల్లేశ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మంత్రి పొన్నం ప్రభాకర్



అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్

బన్సీలాల్‌పేట్: పేదల సంక్షేమం, అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ గొల్లకొమురయ్య కాలనీలో సోమవారం నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్‌కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలందరూ బాగుండాలని ఈ ప్రభుత్వం కోరుకుంటుందన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా, రూ. 500లకు గ్యాస్ సిలిండర్‌తో పాటు ఆరోగ్యశ్రీ వైద్య ఖర్చులను రూ. 10లక్షల వరకు పెంచడం జరిగిందన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ స్థానిక మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారా అంటూ పలకరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె. హేమలత, జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వర్‌రావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సునంద తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు తమకు సొంతిళ్లు కావాలని కోరగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామన్నారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్‌బాబు, రాపాక అశోక్, మహేందర్, కేఎం క్రిష్ణ, నర్సింగ్‌రావుతో మంత్రికి ఎస్సీఆర్పీ నూతన డైరీని అందజేశారు.

పోలింగ్ శాతం పెరిగేలా సహకరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు

సికింద్రాబాద్: ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంతో పాటు, పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని సికింద్రాబాద్ ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ డీసీ సుభాష్‌రావు కోరారు. సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో సికింద్రాబాద్ నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల యువతీ యువకులు నేరుగా లేదా ఆన్‌లైన్ ద్వారా ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని సుభాష్‌రావు చెప్పారు. ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో తక్కువ శాతం పోలింగ్ అయిన కేంద్రాల ప్రాంతాలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ కమిషనర్ చెప్పారు. ఓటరు నమోదు, తప్పొప్పుల సవరణలు, చిరునామా మార్పుకు సంబంధించి రాజకీయ పార్టీల నాయకుల నుంచి అధికారులు సలహాలు స్వీకరించారు. ఈ సమావేశంలో సహాయక ఎన్నికల అధికారులు హేమలత, భార్గవి దేవి, పార్టీల నాయకులు రాజసుందర్, జలంధర్‌రెడ్డి, ప్రవీణ్‌లాల్, ప్రకాశ్‌గౌడ్, శ్యాం, నర్సింగ్‌రావు, కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుల స్వీకరణ..

జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు డివిజన్ల నుంచి పలు ప్రజా సమస్యలను డిప్యూటీ స్పీకర్ సుభాష్‌రావు స్వీకరించారు. తాము స్వీకరించిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం నిర్వహిస్తామని సుభాష్‌రావు చెప్పారు.

కంటోన్మెంట్ సమస్యలపై సీఎం ప్రత్యేక చొరవ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెన్నెల

కంటోన్మెంట్: కంటోన్మెంట్ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని కంటోన్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జీవీ వెన్నెల అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత మర్రి అమరేందర్ రెడ్డితో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిల సమస్యకు సీఎం పరిష్కారం చూపారని అన్నారు. తాము కోరిన వెంటనే రూ.48.53 కోట్ల బకాయిలను విడుదల చేశారని అన్నారు. ఈ నిధులు అందకపోతే కంటోన్మెంట్‌లో జీతాలు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొందని ఈ నేపథ్యంలో మిగతా బకాయిలను సైతం త్వరలో విడుదల చేయిస్తామన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం కంటోన్మెంట్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వెన్నెల వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటలకు రూ.80.14 లక్షలతో చేపట్టనున్న ధోబీఘాట్‌లో మోడర్న్ మెకనైజ్‌డ్ లాండ్రీ యూనిట్ (ఎంఎంఎల్‌యూ) పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకాలను ప్రారంభిస్తారని అనంతరం బొల్లారం డైట్ ప్రాంగణం రూ.4.4 కోట్ల నిధులతో నిర్మించనున్న అకాడమిక్, అడ్మిన్ బ్లాక్ పనులను ప్రారంభిస్తారని తెలిపారు.

- పదేళ్లుగా కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉండి కంటోన్మెంట్ నిధులు ఇవ్వకుండా దివాలా తీయించిన బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు త్వరలో ఓట్లడిగే హక్కులేదన్నారు. రాష్ట్రంలో అధికారంలో వచ్చిన మూడు నెలల్లోనే కేంద్ర ప్రభుత్వంతో రెండుసార్లు సంప్రదింపులు జరిపాకే ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం లభించిందన్నారు.వారంలో రూ.100 కోట్ల సర్వీసు ఛార్జీలు విడుదల చేస్తామని గతంలో బండి సంజయ్ ప్రకటించాడని, ఇప్పటికీ ఆ నిధుల జాడలేదన్నారు.

వేతన బకాయిలు చెల్లించండి



రాజారావుకు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ సిబ్బంది వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని తెలంగాణ మెడికల్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సింగ్ సిబ్బందికి గత నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీఆస్పత్రిలో కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి నర్సింగ్ సిబ్బందికి ప్రభుత్వమే వేతనాలు చెల్లించేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. సదరు కాంట్రాక్టు సంస్థలు నర్సింగ్ సిబ్బంది ఖాతాల్లో పీఎఫ్ డబ్బు జమ చేయడం లేదన్నారు. ప్రతినెల 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని, నర్సింగ్ సిబ్బంది ఖాతాల్లో పీఎఫ్ డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. వేతన బకాయిల విషయం ఆయా కాంట్రాక్టు సంస్థల యాజమాన్యాలతో చర్చించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని సూపరింటెండెంట్ రాజారావు హామీ ఇచ్చినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగమణి, రాజేశ్వరి, పుణ్యమ్మ, కవిత, కోటేశ్వరి, అనసూయ, క్లారా పాల్గొన్నారు.

ముస్లిం శ్మశానవాటిక పనులు త్వరగా పూర్తి చేయండి



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

సనత్‌నగర్: బేగంపేటలోని ముస్లిం శ్మశానటిక నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలోని శ్మశానవాటికను సందర్శించి నూతనంగా నిర్మిస్తున్న భవనం, ప్రహరీ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. మాట్లాడారు. శ్మశానవాటిక ఏర్పాటు స్థానిక ముస్లింలు ఎన్నో సంవత్సరాల కల అన్నారు. కలను సాకారం చేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం శ్మశానవాటిక కోసం సుమారు 2 ఎకరాల భూమిని కేటాయించడమే కాకుండా నిర్మాణం కోసం రూ.2.95 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, డీఎంసీ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ జీఎం వినోద్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి, నరేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థన సభలను విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

రాంగోపాల్‌పేట్: ప్రవక్త బజిందర్‌సింగ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ గురువారం ఎల్బీస్టేడియంలో నిర్వహించనున్న ప్రార్థన సభలను విజయవంతం చేయాలని క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు గడ్డం సాల్మన్‌రాజు పిలుపునిచ్చారు. సోమవారం సికింద్రాబాద్‌లోని ఎస్పీజీ చర్చి ఆవరణలో మాజీ డీజీపీ స్వరణ్‌జిత్ సేన్, ఆయన సతీమణి, అనితా సేన్, బిషప్ మ్యాథ్యూ మీగర్, పాస్టర్ యేసు పాదం తదితరులతో కలిసి నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పంజాబ్‌కు చెందిన ప్రఖ్యాత ప్రవక్త బజిందర్‌సింగ్ సువార్త, స్వస్థత సభలను ఎల్బీస్టేడియంలో సాయంత్రం 3 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు నిర్వహిస్తారని చెప్పారు. ఆయన ప్రార్థనలతో గతంలో ఎంతో మంది స్వస్థత పొందారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జాకబ్, పాస్టర్ ఇశ్రాయేల్, బిషప్ ఆనంద్, యూత్ సభ్యులు డేవిడబ్‌రాజ్, బజరంగ్‌సింగ్, అక్బర్, అశోక్, ధర్మేందర్, పాల్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ విలీనానికి చొరవ చూపాలి



అజిత్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న వికాస్ మంచ్ సభ్యులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీ విలీనం చేసేందుకు చొరవ చూపాలని కంటోన్మెంట్ వికాస్ మంచ్ (సీవీఎం), ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వికాస్ మంచ్ సభ్యులు సోమవారం ముఖ్యమంత్రి సెక్రటరీ అజిత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్రం పరిశీలనలో విలీన అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపితే త్వరితగతిన పూర్తవుతుందని లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. ఎంపీగా కంటోన్మెంట్ బోర్డులో ప్రత్యేక ఆహ్వానితుడిగా కొనసాగిన ముఖ్యమంత్రికి ఈ అంశంపై ప్రత్యేక అవగాహన ఉండటం, విలీన ప్రక్రియకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ సీఈఓగా పనిచేసిన అజిత్ రెడ్డి సైతం రాష్ట్ర ప్రభుత్వంలో కీలక హోదాలో ఉండటం తమకు కలిసి వస్తుందని పేర్కొన్నారు. కంటోన్మెంట్ పరిధిలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి చొరవ చూపడం, రూ.48.53 కోట్ల టీపీటీ బకాయిలు విడుదల చేయడం పట్ల సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపామన్నారు. వినతి ఇచ్చిన వారిలో గడ్డం ఏబెల్, సంకి రవీందర్, అంబాల శ్రీనివాస్ ఉన్నారు.

గృహజ్యోతి, మహాలక్ష్మికి మరో అవకాశం!

- దరఖాస్తుల స్వీకరణకు బేగంపేట సర్కిల్ కార్యాలయంలో కేంద్రం ఏర్పాటు
- డీఎంసీ సమ్మయ్య

సనత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన గడువుగా అర్హులంతా దరఖాస్తు చేసుకున్నారు. అయితే.. దరఖాస్తు చేసుకోని, అర్హులై కూడా తప్పుగా నమోదు, అద్దెకుండే వారికి లబ్ధి చేకూరుతుందా తదితర సందేహాల కోసం బేగంపేట సర్కిల్ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభించారు. ఆరు గ్యారంటీల కోసం అర్హత కలిగి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోలేని వారు ఎవరైనా ఉంటే ఇక్కడి ప్రత్యేక కౌంటర్లలో అందుబాటులో ఉన్న అధికారులకు సంబంధిత పత్రాలతో తమ దరఖాస్తులను అందజేస్తే అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య స్పష్టం చేశారు. అలాగే దరఖాస్తు చేసుకున్నప్పటికీ లబ్ధి చేకూరని వారు ఎవరైనా ఉంటే కూడా అర్హతగా నిర్దేశించిన పత్రాలతో ఇక్కడి కౌంటర్లకు వస్తే తమ సిబ్బంది పరిశీలించి చర్యలు తీసుకుంటారన్నారు. సర్కిల్ పరిధిలోని బన్సీలాల్‌పేట, రాంగోపాల్‌పేట, మోండా, బేగంపేట డివిజన్లకు చెందిన వారి కోసం ఇక్కడ ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించనున్నారు. అదే విధంగా సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లకు సంబంధించి ఖైరతాబాద్ సర్కిల్ కార్యాలయంలో సేవా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ఉప కమిషనర్ జగన్ తెలిపారు.

అప్పటికప్పుడే నమోదు..

దరఖాస్తుల్లో సమస్యలు ఉన్నా, లబ్ధిదారుల ఎంపికలో తప్పుల సవరణ, మరిన్ని సహాయ సహకారాలు అందించేందుకు ఈ సేవా కేంద్రాలు పని చేయనున్నాయి. అన్ని పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజాపాలన సేవా కేంద్రం లబ్ధిదారులకు అందుబాటులో ఉంటుంది. ఎప్పటికప్పుడు ఉప కమిషనర్ పర్యవేక్షణ జరుపుతారు. సేవా కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్ ఉంటారు. సదరు కంప్యూటర్ ఆపరేటర్ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదుకు ప్రజాపాలన లాగిన్ ఇచ్చారు. ఇక్కడకు వచ్చే దరఖాస్తుదారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

తప్పుల సవరణ..కొత్త వారికి అవకాశం..

గతంలో వచ్చిన దరఖాస్తుల తప్పుల సవరణ, పథకానికి అర్హులై జాబితాలో లేకపోతే అర్హుల జాబితాలో చేర్చడం వంటివి చేస్తారు. అలాగే కొత్త వాటిని నమోదు చేస్తారు. ఇటీవల 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే తెల్ల రేషన్ కార్డు దారులకు ప్రజాపాలన దరఖాస్తు ద్వారా జీరో బిల్లు ఇస్తున్నారు. అయితే కొంతమంది ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోకపోవడంతో జీరో బిల్లుతో పాటు రూ.500 గ్యాస్ సిలిండర్‌కు అర్హత కోల్పోయారు. వీరంతా ఈ సేవా కేంద్రాల్లో మళ్లీ అన్ని పత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకుంటే లబ్ధి చేకూరుతుందని అధికారులు పేర్కొన్నారు.

ఇళ్ల వద్దకు వెళ్లి చెత్త సేకరించాలి



డీసీ సుభాష్‌రావుతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్‌లో ఆరోగ్యకర వాతావరణాన్ని నెలకొల్పేందుకు జీహెచ్‌ఎంసీ శానిటరీ విభాగం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు, స్థానిక కార్పొరేటర్ సామల హేమ కోరారు. సోమవారం ఉదయం సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో పారిశుద్ధ్య కార్మికులు, పర్యవేక్షకులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెత్త తరలింపులో చిత్తశుద్ధి లోపిస్తున్న కారణంగా స్థానికుల నుంచి తరచూ ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. కాలనీలు, రహదారుల్లోని చెత్తను ఎప్పటికప్పుడు బయటికి తరలించాలని ఆదేశించారు. అదే విధంగా క్రమం తప్పకుండా ఇళ్ల వద్దకు వెళ్లి చెత్తను సేకరించాలన్నారు. అనంతరం తాత్కాలిక డంపింగ్ కోసం డేడ్‌లాక్ బిల్డింగ్ వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, శానిటరీ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాండ్ పేరెంట్స్ డే



పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల పేరెంట్స్

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో నిర్వహించిన గ్రాండ్ పేరెంట్స్ డేలో విద్యార్థుల తాతయ్యలు, అమ్మమ్మలు, నాయనమ్మలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఈ ఆధునిక కాలంలో పిల్లలకు తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మల విలువలు, అనుబంధాలు, ఆప్యాయతలను తెలిపేందుకు ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

బీజేపీ జాయింట్ కన్వీనర్‌గా మహేశ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్‌గా సేతి మహేశ్ నియమితులయ్యారు. సోమవారం జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి హాజరైన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ సేతిమహేశ్‌కు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. బీజేపీ నాయకులు సమష్టిగా ప్రచార బాధ్యతలు నిర్వహించి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయానికి పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, రవిప్రసాద్‌గౌడ్, ప్రభుగుప్తా, శారదామల్లేశ్, అంబాల రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.



నేడు బోర్డు సమావేశం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం మంగళవారం (నేడు) జరగనున్నట్లు బోర్డు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బోర్డు అధ్యక్షుడు, బ్రిగేడియర్ సోమశంకర్ నేతృత్వంలో జరిగే ఈ సమావేశంలో బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొంటారు. ఇటీవల కేంద్రం కంటోన్మెంట్‌లో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఈ అంశంపై బోర్డు తీర్మానం చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం కంటోన్మెంట్ బోర్డు తమ స్థలాలను కోల్పోతున్నందున ఇందుకోసం రూ.300 కోట్ల పరిహారం అడిగింది. అయితే ఇందుకు కేంద్రం నిరాకరించింది. ఇటీవల బోర్డు పరిధిలో మంచినీటి బోరు బావుల నియంత్రణకు విధి, విధానాలు రూపొందించారు. ఇందుకు సంబంధించి ప్రజల నుంచి అభ్యంతరాలను ఆహ్వానించగా, సుమారు 55 అభ్యంతరాలు అందాయి. వీటిపై కూడా చర్చించి తగిన నిర్ణయం తీసుకోనున్నారు.

ఓయూ విద్యార్థులకు ఉద్యోగాల పంట

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు ఉద్యోగాల పంట పండింది. సోమవారం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకాలను అందుకున్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆయా జిల్లా కేంద్రాల నుంచి ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్ చేరుకున్న అభ్యర్థుల్లో అత్యధికంగా ఓయూ విద్యార్థి నిరుద్యోగులే ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి నేతలు కూడా అనేక మంది ఉన్నారు. డీఎల్, జేఎల్, గురుకుల టీచర్ తదితర ఉద్యోగాల సాధనలో ఓయూ విద్యార్థులు దూసుకెళ్లారు.ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న ఐదు వేల మందిలో సుమారు 500 నుంచి 600 వరకు ఓయూ విద్యార్థి నిరుద్యోగులు ఉంటారని అంచనా.

జైగౌడ ఉద్యమ 7 రాష్ట్రాల నూతన కమిటీ

ఉస్మానియా యూనివర్సిటీ: జైగౌడ ఉద్యమ 7 రాష్ట్రాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ 57వ తరగతి గదిలో జరిగిన జాతీయ ప్లీనరీ సమావేశాల్లో జాతీయ అధ్యక్షులు డాక్టర్ వట్టికోట రామారావుగౌడ్ నూతన కమిటీని ప్రకటించారు. ఏపీ అధ్యక్షులు చిట్టిబొమ్మ కిశోర్‌గౌడ్, తెలంగాణకు గుండ్రాతి నారాయణగౌడ్, మహారాష్ట్రకు సిల్లేవార్ నారాయణగౌడ్, చత్తీస్‌ఘడ్ దీపక్‌గౌడ్ జైస్వాల్, మధ్యప్రదేశ్‌కు మారోతురావ రంగనాథ్‌గౌడ్‌తో పాటు రాష్ట్రాల మహిళ అధ్యక్షురాలు, జిల్లా అధ్యక్షులను ప్రకటించారు. రామారావుగౌడ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 12 కోట్ల మంది జనాభా గల గౌడ్‌లకు పాలన పదవుల్లో వృత్తి రక్షణలో అన్యాయం జరుగుతుంది ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్రా ప్రభుత్వాలు సర్దార్ సర్వాయి పాపన్న చరిత్ర పై నిర్లక్ష్యం వహిస్తున్నారని పాపన్న స్ఫూర్తితో బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేయనున్నట్లు వెల్లడించారు.

కంటోన్మెంట్‌లో ఏకగ్రీవానికి సీఎం చొరవ చూపాలి

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత స్థానంలో ఆమె కుటుంబ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ముఖ్యమంత్రి చొరవ చూపాలని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత ఎం.ఎన్. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దివంగత సాయన్న కుమార్తెగా గత ఎన్నికల్లో పోటీ చేసిన లాస్య నందిత నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచిందన్నారు. దురదృష్టవశాత్తూ రెండున్నర నెలల్లోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందన్నారు. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీలు తమ అభ్యర్థులను బరిలో దింపకుండా లాస్యనందిత కుటుంబ సభ్యుల్లో ఒకరిని ఎమ్మెల్యేగా ఎన్నుకునేందుకు చొరవ చూపాలన్నారు.

సీపీఎస్‌ను అమలు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధ్యాపకులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను అమలు చేయాలని అధ్యాపకులు కోరారు. సోమవారం క్యాంపస్‌లోని సైన్స్ కాలేజీలో సమావేశమైన అధ్యాపకులు దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న సీపీఎస్ అమలుపై ఓయూ అధికారులు స్పందించాలని కోరారు. అన్ని వర్సిటీలు, ప్రభుత్వ రంగ సంస్థలలో సీపీఎస్ అమలు అవుతున్న ఓయూలో మాత్రం ఎల్ఐసీ లింక్‌డ్ పెన్షన్ స్కీమ్ విధానం అమలు చేయడం బాధాకరమన్నారు. ఇతర వర్సిటీలలో ఉద్యోగ విరమణ అనంతరం సీపీఎస్ అమలుతో రూ.40 లక్షలు పొందుతుండగా ఓయూలో ఎల్ఐసీ లింక్ విధానంతో కేవలం రూ.10 లక్షలు మాత్రమే అధ్యాపకులు పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ పెన్షన్ అమలుకు వర్సిటీ అధికారులు బాధ్యత తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రొ.శంకర్, డా.కొర్రెముల శ్రీనివాస్‌రావు, డా.కొండ నాగేశ్వర్ రావు, డా.రామకృష్ణ, డా.ఎం.శ్రీనివాస్, డా.రమేష్, డా.వంశీధర్, డా.శైలజా, డా.అమంచి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మేరెడ్డి చంద్రారెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ: దివంగత ఏబీవీపీ నాయకులు మేరెడ్డి చంద్రారెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని పలువురు విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట మేడిరెడ్డి చంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు డా.రామకృష్ణ, జీవన్, పృథ్వీతేజ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ భవనానికి శంకుస్థాపన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ తరగతి గదుల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పూర్వ విద్యార్థి గోపాల్ టీకే కృష్ణ అందించిన రూ.5 కోట్ల విరాళంతో వీసీ ప్రొ.రవీందర్ సోమవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.5 కోట్లు విరాళం అందించి గోపాల్ టీకే కృష్ణ దంపతులను సన్మానించారు. రాష్ట్ర ఉన్నత విద్య మండలి కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, అలూమ్ని అధ్యక్షులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

రసూల్‌పురా: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి నగరంలోకి ప్రవేశిస్తున్న భారీ వాహనాలను సీజ్ చేస్తామని తిరుమలగిరి ట్రాఫిక్ సీఐ మధుబాబు హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా కరీంనగర్ మార్గం నుంచి బొల్లారం ప్రాంతం గుండా నగరంలోకి ప్రవేశిస్తున్న నాలుగు భారీ వాహనాలను సీఐ మధుబాబు ఆధ్వర్యంలో తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులు పట్టుకుని బొల్లారం పీఎస్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నగరంలోకి భారీ వాహనాలకు రాత్రి పదకొండు నుంచి ఉదయం ఏడు గంటల వరకు మాత్రమే అనుమతి ఉందని నిబంధనలు ఉల్లంఘించి నగరంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

ఆర్ట్స్ కాలేజీ అభివృద్ధికి కృషి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేయనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.అర్జున్‌రావు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు తరగతులకు హాజరు కావాలని విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా అల్లాదుర్గానికి చెందిన బి.శికుమార్ (27) ప్రైవేటు ఉద్యోగి. నాలుగేళ్ల క్రితం శైలజతో వివాహం జరిగింది. వివాహం జరిగినప్పటి నుంచి భార్యతో గొడవలు జరుగుతూనే ఉన్నాయి. దీనికి తోడు కుటుంబ సమస్యలు ఉండడంతో సోమవారం ఉదయం తల్లితో గొడవపడి మల్లాపూర్‌లోని ఇంటి నుంచి బయలుదేరి చర్లపల్లి-మౌలాలి రైల్వేట్రాక్ వద్ద రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

లాస్య నందితకు నేతల నివాళి

కంటోన్మెంట్: దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత దశదిన కర్మను పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని పలువురు నేతలు, కార్యకర్తలు నివాళి అర్పించారు. లాస్య మరణంతో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులు, శోకతప్త హృదయంతో సోమవారం దశదిన కర్మ నిర్వహించారు. మైనింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కృషాంక్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, లోకనాథం, నళిని కిరణ్, నేతలు సాయి కిరణ్, భాస్కర్ ముదిరాజ్ లాస్య చిత్రపటానికి నివాళి అర్పించారు.